సాక్షి
పెద్దపల్లి
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



మల్లన్నస్వామికి పట్నాలు

ఓదెల: ఓదెల శ్రీమల్లికార్జున స్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకుని పట్నాలు వేశారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు.



పాఠశాల సందర్శన

ఎలిగేడు: ఎంపీపీఎస్‌ను ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఇన్‌చార్జి ఈడీ రవికుమార్, యూత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సురేశ్ సందర్శించారు.

గరిష్టం/కనిష్టం
35.0/21.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉదయం, సాయంత్రం చలిగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వద్దు


సమస్యలు తెలుసుకుంటున్న అరుణశ్రీ

పాలకుర్తి(రామగుండం): శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో చేపట్టిన పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయొద్దని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ కోరారు. బసంత్‌నగర్‌లో బుధవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆమె తనిఖీ చేసి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. హరితహారంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించాలని, తడి, పొడిచెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంటింటా మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైనవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, కేశోరాం ఫ్యాక్టరీ నుంచి దుమ్ము వస్తోందని, కుక్కలు, కోతుల బెడద నివారించాలని స్థానికులు కొందరు అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. తగిన చర్యలు తీసుకుంటామని అరుణశ్రీ తెలిపారు. ఎంపీవో షబ్బీర్‌పాషా, ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, ఎంపీటీసీ పాత భాగ్యలక్ష్మి, ఏపీఎం సదానందం, పంచాయతీ కార్యదర్శి నరేశ్ మాజీ సర్పంచ్ కట్టెకోల వేణుగోపాలరావు, ఉమ్మడి పాలకుర్తి మాజీ సర్పంచ్ పర్శవేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'దళితులపై చిన్నచూపు వద్దు'


దీక్ష చేస్తున్న దళిత సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: తాము ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం ఒకరోజు దీక్ష చేపట్టారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఐదారేళ్లుగా తమకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందడంలేదని తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపులోనూ నిర్లక్ష్యమే కనిపిస్తోందని నాయకులు మద్దెల దినేశ్, తాండ్ర సదానందం, రాజారత్నం, సునీల్ ఆవేదన చెందారు. ఆదర్శ వివాహాలు చేసుకున్న వారికి ఇప్పటికీ ప్రోత్సాహకాలు అందలేదని తెలిపారు. కాంగ్రెస్ పాలకులైనా దళితుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. నాయకులు పెర్క సతీశ్, కోడెం స్వామి, రమ, తిరుమల, రమేశ్, రాజయ్య, సదానందం, వెంకటేశ్, లెనిన్, మనస్‌కుమార్, ఉదయ్ పాల్గొన్నారు.

మొక్కలను కాపాడాలి


మొక్కలు పరిశీలిస్తున్న సత్యనారాయణ

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): వేసవి తీవ్రత దృష్ట్యా నర్సరీల్లో షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేసి మొక్కలను సంరక్షించాలని ఈజీఎస్ ఏపీడీ సత్యనారాయణ సూచించారు. మొట్లపల్లిలోని నర్సరీలో బుధవారం ఆయన మొక్కలు పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మొక్కల సంరక్షణపై టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. మొక్కలకు రోజూ నీళ్లు పట్టాలని, కలుపు తీసివేయాలని సూచించారు. నీటికుంటలు, కాలువల నిర్మాణాలు, అటవీ అభివృద్ధి పనులు, చిన్నగ్రామాలను కలిపే రోడ్లు నిర్మించాలని, మేకలు, గొర్రెలకు షెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహనాచారి, హెచ్‌వో మంజుల పాల్గొన్నారు.

పనుల ప్రగతిపై సమీక్ష


సమీక్షిస్తున్న రైల్వే ఉన్నతాధికారులు

రామగుండం: అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టిన రామగుండం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ ప్రగతిపై రైల్వే ప్రజాసంధానాల (డీఆర్‌యూసీసీ) సభ్యుడు క్యాతం వెంకటరమణ బుధవారం రైల్వే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ.30కోట్లతో చేపట్టిన ఒకటి, రెండో ప్లాట్‌ఫారాలపై ఎస్కలేటర్లు, పార్కింగ్ షెడ్డు, ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్లు, అధునాతన వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫారాలపై నుంచి నేరుగా బయటకు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి, వికలాంగుల కోసం ర్యాంపులు, డ్రైనేజీలు, ప్రహారీల నిర్మాణం, ప్లాట్‌ఫారం ఎత్తు పెంపు పనులపై వారు ఆరా తీశారు.

పోలీస్‌బాస్ ఎవరు?

- నెలక్రితమే పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి బదిలీ ఉత్తర్వులు
- ఇన్‌చార్జి కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి తరుణ్‌జోషి నియామకం
- ఇప్పటికీ రెగ్యులర్ పోలీస్‌బాస్‌ను నియమించని వైనం
- అస్మదీయుల కోసం అధికారులు, రాజకీయ నేతల పైరవీల జోరు
- ఉత్కంఠ రేపుతున్న రామగుండం పోలీసు కమిషనర్ నియామకం



రామగుండం పోలీస్ కమిషనరేట్

గోదావరిఖని: తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో అత్యంత కీలకంగా ఉన్న రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు పోలీస్ బాస్ నియామకంలో తీవ్రజాప్యం కావడం చర్చనీయాంశంగా మారింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రధానంగా నక్సల్స్ ఏరివేత కోసం ముందుకు సాగే పోలీస్ కమిషనరేట్‌లో సీపీని ఎవరిని నియమిస్తారనే దానిపై పోలీస్ శాఖలోనే చర్చ జోరుగా సాగుతోంది. మొన్నటివరకు ఇక్కడ పనిచేసిన పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరిని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీగా బదిలీ చేస్తూ ఈనెల ఒకటో తేదీన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమె స్థానంలో రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం ఇన్‌చార్జి సీపీగా డాక్టర్ తరుణ్‌జోషికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

గతనెల 3న రెమా రాజేశ్వరి బదిలీ..

- వాస్తవానికి గతనెల 3న రామగుండం సీపీ రెమా రాజేశ్వరిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.
- అదేసమయంలో ఆమె స్థానంలో ఎల్‌హెచ్ చౌహాన్‌ను నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు.
- అయితే చౌహాన్ బాధ్యతలు చేపట్టకుండానే ఉత్తర్వులు రద్దయినట్లు ప్రచారం జరుగుతోంది.
- ఇక్కడ ఉన్న రాజకీయ నాయకులకు ఆ పోలీస్ అధికారి తీరు నచ్చకపోవడంతోనే బదిలీ రద్దయినట్లు చర్చ సాగుతోంది.
- బదిలీ ఉత్తర్వులు వచ్చిన తర్వాత నెలరోజుల పాటు కమిషనర్‌గా పనిచేసిన రెమా రాజేశ్వరిని పాత స్థానమైన ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేశారు.
- అయితే ఆమె స్థానంలో ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఇక్కడ సీపీ ఎవరనే దానిపై చర్చ జోరుగా జరుగుతోంది.

రాష్ట్రాల సమన్వయంలో కీలకపాత్ర

నిషేధిత మావోయిస్టుల దూకుడును కట్టడి చేసేందుకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసు అధికారులను సమన్వయం చేయడంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ కీలకపాత్ర వహిస్తోంది. ఇటీవలే మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ పోలీస్ అధికారుల సమావేశం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కమిషనరేట్ కీలక పాత్ర పోషించనుంది. ఈక్రమంలో ఇక్కడి కీలకపోస్టు భర్తీ జాప్యంపై పోలీస్‌శాఖలో చర్చ జరుగుతోంది.

పలువురు అధికారుల ప్రయత్నాలు

- రెండు జిల్లాలకు పోలీస్‌బాస్‌గా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలున్న కీలకమైన రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు పోలీస్ అధికారి ఎవరనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది.
- కొంతమంది పోలీసు అధికారులు తమకు నచ్చిన అధికారిని తీసుకొచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లుగా చెబుతున్నారు.
- అలాగే రాజకీయ నాయకుల అండదండ పుష్కలంగా ఉన్న మరోఅధికారి కూడా పోలీస్ కమిషనర్‌గా రామగుండం వచ్చే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.
- ఇందులో చాలామంది పోలీసు అధికారుల పేర్లు ఉన్నట్లు కూడా చర్చ సాగుతోంది.
- అయితే గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లానే కాదు.. రాష్ట్రంలోని పలువురు పోలీసు అధికారులను వివిధ కారణాలతో ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది.
- ఈసారి పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది.
- ఈ నేపథ్యంలో పోలీసు కమిషనర్‌ను ఇప్పటికిప్పుడు నియమిస్తే.. ఎన్నికల కమిషన్ బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.
- దీంతోనే రామగుండంలో ప్రస్తుతం పోలీసు కమిషనర్ పోస్టింగ్‌పై ప్రతిష్టంభన ఏర్పడినట్లుగా చర్చ జరుగుతోంది.

పెద్దపల్లిని కాదని రామగుండంలో..

రామగుండం, మంచిర్యాల కోల్‌బెల్ట్ ఏరియాల్లో అత్యధికంగా క్రైం రేట్ నమోదవుతోంది. హత్యలు, ప్రతీకార దాడులు, హింసాత్మక ఘటనలు, అసాంఘిక కార్యకలాపాలకు ఒకప్పుడు చిరునామాగా మారింది. వీటితోపాటు అప్పటి పీపుల్స్‌వార్ అనుబంధ సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) కార్యకలాపాలూ అధికంగా ఉండేవి. వీటన్నింటినీ నియంత్రణలోకి తీసుకు రావడం, శాంతిభద్రతలను కాపాడడం కోసం అప్పటి ప్రభుత్వం రామగుండంలోనే పోలీసు కమిషనరేట్ ఏర్పాటు చేస్తే సత్ఫలితాలు సాధించవచ్చని భావించింది. ఆ మేరకు జిల్లా కేంద్రం పెద్దపల్లిని కాదని రామగుండం పారిశ్రామిక(గోదావరిఖని) ప్రాంతంలో పోలీసు కమిషనరేట్ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసింది. ఇంతటి కీలకమైన కమిషనరేట్‌కు నెలదాటినా రెగ్యులర్ పోలీస్‌బాస్ నియామకంపై ప్రతిష్టంభన కొనసాగడం ఉత్కంఠకు గురిచేస్తోంది.

ఆడపిల్లలని అధైర్యపడొద్దు


బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


ఆడశిశువును చూసి మురిసిపోతున్న కలెక్టర్

- వాళ్లే అన్నిరంగాల్లో రాణిస్తున్నారు
- కవలలు ప్రయోజకులవుతారు
- కన్నతల్లి ఆవేదనకు చలించిన కలెక్టర్
- తనకూ అమ్మాయి పుట్టేలా ఆశీర్వదించాలని సూచన

పెద్దపల్లిరూరల్: 'ఆడపిల్లలు పుట్టారని బాధపడొద్దమ్మా.. ప్రస్తుతం అమ్మాయిలే అన్నిరంగాల్లో రాణిస్తున్నారు.. అబ్బాయిల కన్నా ప్రతిభావంతులవుతున్నారు..' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. అయితే, తనకు తొలికాన్పులో ఓ ఆడపిల్ల పుట్టిందని, మలికాన్పులో ఇప్పుడు కవలలు ఆడపిల్లలే జన్మించారని సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్ గ్రామానికి చెందిన బాలసాని లావణ్య- సంపత్ దంపతులు, బంధువులు బాధపడుతుండడాన్ని గమనించిన కలెక్టర్.. వెంటనే వారివద్దకు వెళ్లారు. వారితో కాసేపు ముచ్చటించారు. ఆడపిల్లలు అన్నిరంగాల్లో ప్రతిభ చూపుతున్నారని, ఈ కవలలు ఉన్నత స్థానాలు అధిరోహిస్తారని భరోసా కల్పించారు. తనకూ ఆడపిల్ల పుట్టాలని ఆశీర్వదించాలని ఆ దంపతులకు సూచించారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచండి

ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రోత్సహించాలని సూపరింటెండెంట్ రమాకాంత్‌కు కలెక్టర్ సూచించారు. తొలి కాన్పులో శస్త్రచికిత్సలే అధికంగా నమోదవుతున్నాయని, అలా కాకుండా సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని చెప్పారు. అవసరమైతే గర్భిణులతో వ్యాయామం చేయించాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా సేవలను అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎకరాకు రూ.50లక్షలు చెల్లించండి

- పుట్టపాక నిర్వాసితుల డిమాండ్


మాట్లాడుతున్న నిర్వాసితులు

మంథని: జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు ఎకరాకు రూ.35లక్షల నుంచి రూ.50లక్షల వరకు పరిహారం చెల్లించకుంటే తాము భూములు ఇవ్వబోమని, అవసరమైతే ఆత్మహత్యలకు వెనుకాడబోమని పుట్టపాక గ్రామస్తులు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామస్తులు పెగడ శ్రీనివాస్, ఐలి శ్రీనివాస్ మాట్లాడారు. ఆర్డీవో హనుమా నాయక్ మంగళవారం తమతో సమావేశమైన సందర్భంగా మాట్లాడిన తీరు తమను బాధకు గురిచేసిందని ఆవేదన చెందారు. మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తామని అంటున్నారని, ఓపెన్ మార్కెట్‌లో ఎకరాకు రూ.30లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ధర పలుకుతోందని తెలిపారు. అధికారులు చేసిన సర్వేలోనూ అనేక పొరపాట్లు ఉన్నాయన్నారు. ఇళ్లు, బోరుబావులు, తోటలు, షెడ్లు నష్టపోతున్నందున వాటిని మళ్లీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో తమకు భూములు కేటాయించాలని వారు కోరారు. భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న తమకు న్యాయం చేయాలని కోరారు. అంతకుముందు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నిర్వాసితులు శ్రీనివాస్, మల్లయ్య, సత్యనారాయణ, వెంకటి, రాజయ్య, జీవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాసం

- డిప్యూటీ రిజిస్ట్రార్‌కు నోటీసు


డీసీవోకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు పదిమంది సభ్యులు పెద్దపల్లి డిప్యూటీ రిజిస్ట్రార్ రాంమోహన్‌కు బుధవారం నోటీసు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా, కొలనూర్‌కు చెందిన మద్దెల కమల వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. సొసైటీలో 13మంది సభ్యుల్లో గోపరపల్లె డైరెక్టర్ బొయిని తిరుపతియాదవ్ మృతిచెందారు. మిగిన వారిలో ఆళ్ల సుమన్‌రెడ్డి, మూల సాగర్‌రెడ్డి, చింతం స్వామి, గుగులోతు పర్శ్యనాయక్, కాంతాల సమ్మిరెడ్డి, కట్కూరి కవిత, కొట విజయ, బొంగోని శ్రీనివాస్, కొట్టె దేవేందర్, తాళ్లపల్లి సదయ్య కలిసి చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చీకట్ల మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం విండో చైర్మన్‌పై..

ముత్తారం(మంథని): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడానికి డైరెక్టర్లు రంగం సిద్ధం చేసుకున్నారు. మొత్తం 13 మంది డైరెక్టర్లలో ఐదుగురు కాంగ్రెస్, 8మంది బీఆర్ఎస్‌కు చెందిన వారు ఉన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు అవిశ్వాస తీర్మానానికి సన్నాహాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన డైరెక్టర్లు గుజ్జ గోపాల్‌రావు, ఏలువాక కొమురయ్య, నాయిని పార్వతి, కొంకటి మల్లన్న శ్రీధర్‌బాబు సమక్షంలో ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అవిశ్వాస తీర్మానానికి అవసరమైన సంఖ్యాబలం సరిపోయింది. దీంతో గురువారం అవిశ్వాస తీర్మానం నోటీసును అధికారులకు అందించేందుకు సిద్ధమయ్యారని తెలిసింది. కాగా, మరో ఇద్దరు బీఆర్ఎస్ డైరెక్టర్లు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ముగ్గురు డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరడంతో అప్రమత్తమైన బీఆర్ఎస్ డైరెక్టర్లతో ఆ సంఘం చైర్మన్ నాలుగు రోజులపాటు ప్రత్యేకంగా క్యాంపు నిర్వహించారు. ఆ తర్వాత వారిని వదిలేశారు. దీంతో ఆ డైరెక్టర్లు మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం అల్లాడి యాదగిరిరావును చైర్మన్‌గా ప్రతిపాదించిందని, వైస్ చైర్మన్‌గా ప్రతిపాదించలేదని పలువురు డైరెక్టర్లు చెబుతున్నారు.

ఓసీపీ-3లో కార్మిక నేతల ఇష్టారాజ్యం

- ఆందోళనకు దిగిన కార్మికులు


ఆందోళన చేస్తున్న కార్మికులు

గోదావరిఖని: ఓసీపీ-3లో కార్మిక సంఘాల నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. టార్గెట్లు పెడుతూ వినని కార్మికులను బెదిరిస్తున్నారు. ఈమేరకు బాధిత కార్మికులు బుధవారం ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. టార్గెట్లు పెడుతూ లంచ్ కంటిన్యూ చేయాలని ఏఐటీయూసీ నాయకులు బెదిరిస్తున్నారని వాపోయారు. యాజమాన్యం చెప్పినట్లుగా వినకుంటే బదిలీలు చేస్తామని, పాత చార్జిషీట్లు బయటకు తీస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈక్రమంలో గని మేనేజర్‌తో వాగ్వావాదానికి దిగారు. కార్మికుల పక్షాన నిలబడి నిజాయితీగా వ్యవహరించాల్సిన ఏఐటీయూసీ నాయకులు.. కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ నాయకులే డ్యూటీలకు వచ్చి అవుట్ మస్టర్ పడకుండానే బయటకు వెళ్తున్నారని, కొన్ని సందర్భాల్లో సమయానుకూలంగా రాకుండా మస్టర్ వేయాలని బెదిరిస్తున్నారని వారు మండిపడ్డారు. యాజమాన్యానికి వత్తాసు పలికే విధానాన్ని మానుకుని గత ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని యూనియన్ నాయకులు కొత్త సత్యనారాయణరెడ్డి, ఉల్లి మొగిలి, ప్రవీణ్, రాంప్రసాద్ తదితరులు డిమాండ్ చేశారు.

డ్రైవర్లకు ఎన్నికల భత్యం అందేది ఎప్పుడు?

- రెండు నెలలు దాటినా అందని సొమ్ము
- ఆవేదనలో డ్రైవర్లు, క్లీనర్లు


వాహనాల్లో ఎన్నికల సిబ్బందిని తరలించిన డ్రైవర్లు, క్లీనర్లు

జ్యోతినగర్(రామగుండం): మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గంలో విధులు నిర్వర్తించిన రవాణా వాహన డ్రైవర్లు, క్లీనర్లకు ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. దీంతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గత సంవత్సరం నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితోపాటు అధికారులు, సిబ్బందిని తరలించేందుకు 20 మినీ బస్సులు, 33 పెద్దబస్సులను వినియోగించారు. వీటిపై 53 మంది డ్రైవర్లు, 53 మంది క్లీనర్లు విధులు నిర్వహించారు. డ్రైవర్‌కు రోజుకు రూ.520, క్లీనర్‌కు రూ.390, మినీ బస్సుకు రూ.2,860, పెద్దబస్సుకు రూ.4,485.. మొత్తంగా రూ.5,06,870 బిల్లులు విడుదల కావాల్సి ఉంది. వీటికోసం శ్రీరాజరాజేశ్వర ట్రావెల్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు ద్వారా ఎన్నికల అధికారులకు బిల్లుల వివరాలు పంపించారు. జనవరి 9వ తేదీన ట్రాన్స్‌పోర్టు ద్వారా పంపించిన బిల్లులను సరిచేయాలంటూ మినీ బస్సుకు రూ.2,000, పెద్ద బస్సుకు 3,000.. మొత్తం రూ.3,74,460కు బిల్లులు పంపాలంటూ సంబంధిత విభాగం వారు ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులకు సూచించారు. బిల్లు సరిచేసి పంపించి నెల కావస్తున్నా డ్రైవర్లకు, క్లీనర్లకు రావాల్సిన భత్యం రాకపోవడంతో సంబంధిత వాహన యజమానులపై ఒత్తిడి తెస్తున్నారు. వారు ఎన్నికల విభాగం నుంచి బిల్లులు వచ్చిన తర్వాత చెల్లిస్తామని డ్రైవర్లు, క్లీనర్లకు సమాధానం చెబుతున్నారు.

భత్యం ఇవ్వండి



అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సిబ్బందిని పోలింగ్ బూత్‌లకు తరలించిన బస్సు డ్రైవర్లకు భత్యం ఇవ్వండి. ఎన్నికలు పూర్తయి రెండు నెలలు అవుతుంది. మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు కూడా వస్తున్నాయి. మాకు భత్యం చెల్లించాలని కోరుకుంటున్నాం. – శ్రీనివాస్, డ్రైవర్

రోజూ 520 రావాలి



రెండురోజులు నేను ఎన్నికల విధులు నిర్వహించిన. రోజుకు రూ.520 చొప్పున రూ.1040 రావాలి. క్లీనర్లకు కూడా రోజుకు రూ.390 చొప్పున రావాల్సి ఉంది. ఎన్నికల అధికారులు మాకు భత్యం తొందరగా వచ్చేలా చూడండి. – రమేశ్, డ్రైవర్

ప్రభుత్వ పరిధిలో ఉంది

ఎన్నికల రవాణా సిబ్బందికి చెల్లించాల్సిన బిల్లు ప్రభుత్వ అనుమతి కోసం ఉంది. త్వరలోనే అనుమతి పొంది చెల్లింపులను సంబంధిత ట్రాన్స్‌పోర్టు వారి ఖాతాలో జమ చేస్తాం. – అరుణశ్రీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఆదాయం పెంపుపై దృష్టి పెట్టండి

- ఆస్తిపన్ను వసూళ్లలో వృద్ధి సాధించకుంటే చర్యలు
- అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, మెప్మా విభాగాల పనితీరుపై కమిషనర్ నాగేశ్వర్‌తో కలిసి సమీక్షించారు. ఒక్కో బిల్‌కలెక్టర్ వసూలు చేసిన ఆస్తిపన్నుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్తిపన్ను 36శాతమే నమోదు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం గడువు చివరిదశకు చేరుతున్నా ఆశించిన రీతిలో వసూలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు ఆస్తిపన్ను వసూలు చేయాలని బిల్‌కలెక్టర్లను అదనపు కలెక్టర్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి బిల్లులు, ట్రేడ్ లైసెన్స్, వాణిజ్య ప్రకటనల ట్యాక్స్ తదితర డిమాండ్ల నివేదికను సమర్పించాలని ఆదేశించారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని సూచించారు. అనుమతి లేనికట్టడాలు, రోడ్లు తదితర వాటిని ఆక్రమించిన కట్టడాలపై చర్యలు తీసుకోవాని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. హరితహారం కోసం ముందస్తుగా ఇంటింటి సర్వే చేపట్టి, ప్రజలు ఎలాంటి మొక్కలను కోరుకుంటున్నారో వివరాలు సేకరించాలని మెప్మా విభాగం అధికారులను ఆదేశించారు. అధికారులు త్రియంబకేశ్వర్‌రావు, రాయలింగు, చిన్నారావు, సుచరణ్, మెప్మా డీపీఎం రజని పాల్గొన్నారు.

21లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ధర్మారం(ధర్మపురి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఈనెల 21వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని కోఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు కోరారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే ఏప్రిల్, మేలో జరిగే ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మీ సేవ, టీఎస్ ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలని ఆయన సూచించారు. పదో తరగతి పరీక్ష ఫీజు ప్రతీ సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్‌లో ప్రతీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్‌కు రూ.150 చెల్లించాలని ఆమర పేర్కొన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 12 నుంచి 21లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ఆయన కోరారు. అపరాధ రుసుంతో ఈనెల 27 నుంచి మార్చి 4వ తేదీ వరకు చెల్లించే అవకాశం ఉందని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని ఓపెన్ స్కూల్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

మంత్రులకు వినతి



మంత్రి కొండా సురేఖకు సమస్యలు వివరిస్తున్న అర్చకులు

జ్యోతినగర్(రామగుండం): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దీప, ధూప, నైవేద్య అర్చక సంఘం ప్రతినిధులు బుధవారం మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కు వినతిపత్రాలు సమర్పించారు. అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీశ్‌శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌శర్మ తదితరులు బుధవారం హైదరాబాద్‌లో మంత్రులను కలిశారు. సమస్యల పరిష్కారానికి మంత్రులు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో బ్రాహ్మణ వెల్ఫేర్ సంఘం ప్రతినిధి జక్కపురం నారాయణస్వామి, జిల్లా అధ్యక్షుడు నవీన్, గౌరవ అధ్యక్షుడు కాండూరి దామోదర ఆచార్యులు, ఉపాధ్యక్షుడు ఏటూరి శ్రవణ్ కుమార్ ఆచార్యులు, రామగుండం అధ్యక్షుడు రుద్రభట్ల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఎలిగేడు(పెద్దపల్లి): గ్రామాల్లో పకడ్బందీగా ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సూచించారు. సుల్తాన్‌పూర్‌లో బుధవారం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనుల గ్రామసభలో ఆయన మాట్లాడారు. మండలంలోని 12గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. గ్రామాలను స్వచ్ఛంగా ఉంచాలని సూచించారు. ఎంపీపీ తానిపర్తి స్రవంతి, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న మార్నింగ్ వాకర్స్

రామగుండం: పట్టణంలోని జెన్‌కో క్లబ్, క్రీడామైదానంలోని సమస్యలు పరిష్కరించాలని మార్నింగ్ వాకర్స్ బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌కు వినతిపత్రం అందజేశారు. తొలుత ఆయనను శాలువాతో సత్కరించారు. ఓపెన్‌జిమ్, రెండు టాయిలెట్లు, టెన్నిస్ కోర్టు, వాలీబాల్ కోర్టు, వాకర్స్ ట్రాక్ తదితర సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని కోరారు. మార్నింగ్ వాకర్స్ హరిప్రసాద్, ముంజా పూర్ణగౌడ్, వసీం, అర్జున్‌యాదవ్, బి.శ్రీనివాస్, రమేశ్, కంది దశరథం, ఎండీ పాషా, శ్రీనివాస్, బాలకృష్ణ, సంతోష్, సతీశ్, కుడుముల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి పేకాడుతున్నారన్న సమాచారంతో సీఐ రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేపట్టారు. పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపైనా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అడుగంటుతున్న ఆశలు

- ఎల్లంపల్లికి నిలిచిన కాళేశ్వరం ఎత్తిపోతలు
- నగానికిపైగా పడిపోయిన నీటినిల్వలు
- ఆయకట్టుకు సాగునీటి సరఫరా ప్రశ్నార్థకం



ఎల్లంపల్లి ప్రాజెక్టు



పార్వతీ బ్యారేజీలో అడుగంటిన నీటి నిల్వలు

రామగుండం: పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటినిల్వలు సగానికిపైగా పడిపోయాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు, నీటి నిల్వలు 20.175 టీఎంసీలు కాగా, మంగళవారం నీటిమట్టం 144.73 మీటర్లు, నీటినిల్వలు 12.11 టీఎంసీలకు పడిపోయాయి. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 435 క్యూసెక్కులు ఉంది. హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్‌కు 289 క్యూసెక్కులు పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండడంతో మరో 15 రోజులు గడిస్తే ప్రాజెక్టులో నీటి నిల్వలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

ఆయకట్టు ప్రశ్నార్థకం..

- ఎల్లంపల్లి పరిధిలోని ప్యాకేజీ–6 కింద ఉన్న పాలకుర్తి మండలం వేంనూర్, ధర్మారం మండలం మేడారం పంపుహౌస్ నుంచి గ్రావిటీ ద్వారా కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో సుమారు 2లక్షల ఎకరాల ఆయకట్టుకు 12 టీఎంసీల నుంచి సరాఫరా చేస్తున్నారు.
- కుందనపల్లి ఐవోసీ ఇందిరమ్మకాలనీ పంపుహౌస్ నుంచి నుంచి 6.5 టీఎంసీలను ఎన్టీపీసీ విద్యుత్ అవసరాలకు, మరో 2 టీఎంసీలను కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, పాలకుర్తి మండలాల్లోని 20వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది.
- వీటితోపాటు మంచిర్యాల జిల్లా గూడెం ఎత్తిపోతల ద్వారా మూడు టీఎంసీలను ఎత్తిపోయడంతో హాజీపూర్, లక్సెట్టిపేట, దండెపల్లిలో 30వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించేవారు.
- ప్రస్తుతం గూడెం పంపుహౌస్ నుంచి మాత్రమే ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. దాని ఆయకట్టుకు పాక్షికంగా సాగునీరు అందుతోంది.
- మరోవైపు.. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటినిల్వలు అడుగంటడంతో మంథని, నందిమేడారం, వేంనూర్ పంపుహౌస్‌ల నుంచి ఎత్తిపోతలు నిలిచిపోయాయి.
- ఫలితంగా ప్రస్తుత యాసంగి పంటలకు సాగు నీరు అందించలేని దుస్థితి నెలకొంది.
- కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో ఎల్లంపల్లిలోకి ఎత్తిపోతలతో ఎగువన ఉన్న పంపుహౌసల ద్వారా ఆయకట్టుకు కూడా సమృద్ధిగా సాగు నీరందించే అవకాశం ఉండేది.
- అయితే, ఎన్టీపీసీకి, హైదరాబాద్ మెట్రోకు ఎల్లంపల్లి నుంచి నీటి సరఫరాకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాల్సిందే.
- ప్రస్తుతం గోదావరినదిలోనూ నీళ్లులేవు.

పార్వతీ బ్యారేజీలోనూ..

కాళేశ్వరం ప్రాజెక్టుతో రివర్స్ పంపింగ్ ద్వారా పార్వతీ బ్యారేజీ నుంచి ఎల్లంపల్లిలోకి ఎత్తిపోతలు కొనసాగించేవారు. బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 8.83 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.21 టీఎంసీలే ఉంది. దీంతో ఎల్లంపల్లిలోకి ఎత్తిపోతలకు అవకాశం లేకుండా పోయింది. మేడిగడ్డ బ్యారేజీ పగు ళ్లు చూపడంతో పునరుద్ధరణ పనులకు కసరత్తు చేస్తున్నారు. దాని ఎగువనఉన్న అన్నా రం, సుందిళ్ల బ్యారేజీల్లోని నీటిని దిగువకు వదిలిపెట్టి ఖాళీ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు పూర్తయేదెప్పుడో, రివర్స్ పంపింగ్‌తో ఎల్లంపల్లిలోకి నీటి సరఫరా ఎప్పుడు చేస్తారోనని రైతులు, జిల్లావాసులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

- దీంతో నదీ పరివాహక గ్రామాల్లోనూ భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉందని అదికారులు అంటున్నారు.
- ఫలితంగా వ్యవసాయ పంపుసెట్లు నడిచే పరిస్థితి లేదని ఆయకట్టు పరిధిలోని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలి

- నాణ్యమైన భోజనం అందించాలి
- మైనారిటీ సంక్షేమాధికారి మెహరాజ్
- రెసిడెన్షియల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ



వంటగది పరిశీలిస్తున్న అధికారి మెహరాజ్

పెద్దపల్లిరూరల్: పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మెహరాజ్‌ఖాన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పాఠశాల ఆవరణ, వంటగది పరిశీలించారు. వంట తయారీ, ఇతరత్రా పనులపై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. బుధవారం లంచ్ లర్న్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలను పరిశీలించి ఇక్కడి పరిస్థితులపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లల ఇబ్బందుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట అధికారులు తదితరులు ఉన్నారు.

జీఎంను కలిసిన నాయకులు



జీఎంతో కమిటీ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ–2 ఏరియా ఏఐటీయూసీ జీఎం ఆఫీస్ నూతన కమిటీ సభ్యులు బుధవారం ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా జీఎం కార్యాలయంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వివరించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఎల్.ప్రకాశ్, రాజారత్నం, జిగురు రవీందర్, అన్నారావు పాల్గొన్నారు.

ఉత్పత్తి దశలోకి 'బీ–థర్మల్'



బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని బుధవారం ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చారు. బాయిలర్ ట్యూబ్స్ లీకేజీతో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలుగడంతో సోమవారం షట్‌డౌన్ చేశారు. ఈ నేపథ్యంలో 48 గంటల పాటు ఇంజినీర్లు, అధికారులు, ఉద్యోగులు నిరంతరం శ్రమించి కేంద్రాన్ని విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకువచ్చారు.

13లోగా అభ్యంతరాలు తెలపండి

పెద్దపల్లిరూరల్: జాతీయ ఆరోగ్యమిషన్ కింద ఆయుష్ విభాగంలో పనిచేసేందుకు ఖాళీగా ఉన్న పోస్టుల ప్రొవిజనల్ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 13లోగా ఆధారాలతో తమ దృష్టికి తీసుకు రావాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రొవిజినల్ మెరిట్ జాబితా కార్యాలయంలోని నోటీస్‌బోర్డు, జిల్లా వెబ్‌సైట్‌లో గురువారం(ఈనెల 8న) అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. తదుపరి ఆ జాబితాలో ఎటువంటి సవరణలు ఉండవని, ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల తనిఖీ

మంథని: పట్టణంలోని పలు పాఠశాలలు, వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ బడుల్లో చేపట్టిన స్కూల్ కాంప్లెక్ సమావేశాలను జిల్లా విద్యాధికారి మాధవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలను సందర్శించిన డీఈవో.. బోధన తీరులో తీసుకోవాల్సిన మెలకువలు.. ఇతరత్రా అంశాలపై ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను డీఈవో అభినందించారు.

పత్తి ధర రూ.6,714

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పత్తి క్వింటాలుకు గరిష్ఠంగా రూ.6,714 ధర పలికింది. కనిష్ఠ ధర రూ.5,711 కాగా, సరాసరి ధర రూ.6,477గా నిర్ణయించినట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎలిగేడు(పెద్దపల్లి): ధూళికట్ట గ్రామానికి చెందిన కసువోజ్వల రామ్మూర్తి(50) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. రామ్మూర్తి తన కుమారుడు సుబ్రహ్మణ్యంను తీసుకుని ఈనెల 3న కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో సుల్తాన్‌పూర్ ఎస్సీకాలనీ వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో రామ్మూర్తి, అతడి కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకోసం వెంటనే వారిని కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామ్మూర్తి మంగళవారం రాత్రి మృతి చెందాడు. అతడి కుమారుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. రామ్మూర్తికి భార్య, గాయాలపాలైన సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీ

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో బుధవారం తెల్లవారుజామున దుండగులు 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీ చేసినట్లు ఏఈ సంపత్‌కుమార్ తెలిపారు. దాని విలువ రూ.20 వేలు ఉంటుందన్నారు. కానీ, విద్యుత్‌వైర్లు కట్ చేసి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. మళ్లీ కొత్తది బిగించాల్సి ఉంటుందని, ఇందుకు రూ.లక్ష వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఉద్యోగులు క్రీడలకు సమయం వెచ్చించాలి

గోదావరిఖని: ప్రతీ ఉద్యోగి విధినిర్వహణతోపాటు క్రీడలకు కొంత సమయం వెచ్చించాలని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ సూచించారు. బుధవారం రాత్రి స్థానిక సీఈఆర్ క్లబ్‌లో 57వ క్రీడాదినోత్సవం నిర్వహించారు. పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడారు. ఈసందర్భంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి, యూనియన్ నాయకుడు కె.స్వామి, అధికారుల సంఘం నాయకుడు దామోదర్, అధికారులు రాంమోహన్, లక్ష్మీనారాయణ, బంగారు చక్రపాణి, ఆరెల్లి పోశం, క్రీడా సూపర్‌వైజర్ రమేశ్, కో ఆర్డినేటర్ రాజయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని అమర్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై రవీందర్‌రావు వివరాల ప్రకారం.. చుంచు సాయికుమార్(23) హమాలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. తన సోదరి పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలోనన్న బెంగతో బుధవారం క్రిమిసంహార మందు తాగాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

సిరిసిల్లలో చిన్నారి కిడ్నాప్ కలకలం !

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పాతబస్టాండ్ సమీపంలోని ఓ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థినికి చాక్లెట్ ఆశచూపి కిడ్నాప్ చేసేందుకు యత్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివే ఎనిమిదేళ్ల చిన్నారి ఉదయం ఇంటర్‌వెల్ సమయంలో తోటి విద్యార్థులతో కలిసి తరగతిగది నుంచి బయటకొచ్చింది. తల్లిదండ్రుల మాదిరి ఒకరు పాఠశాల పరిసరాలకు చేరి చిన్నారిని రావాలంటూ చేతిలో చాక్లెట్ పట్టుకుని పిలవడంతో దగ్గరకెళ్లింది. చాక్లెట్ ఇచ్చినట్లే ఇచ్చి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించడంతో.. అప్రమత్తమైన చిన్నారి ఆ ఆగంతకుని చేతిని కొరికి స్కూల్‌లోకి పరుగెత్తింది. దీన్ని గమనించిన స్కూల్ పీఈటీ అక్కడికొచ్చిన వారిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. స్కూల్ పరిసరాల్లో సంచరించిన ఆగంతకులను పట్టుకొని పోలీసులకు అప్పజెప్పామని విద్యార్థులకు యాజమాన్యం తెలిపిందని తెలిసింది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా చిన్నారి కిడ్నాప్‌నకు యత్నం జరిగిన విషయం తమకు తెలియదని తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు భయాందోళన చెందుతున్నట్లు తెలిసింది.

బొగ్గు బాయి వార్తలు

ప్రభుత్వ సంస్థలను నీరుగార్చుతున్న కేంద్రం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న భాస్కర్

గోదావరిఖని: ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరుగార్చుతోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఆర్జీ–2 ఏరియా బ్రాంచ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని కోరారు. బొగ్గు బ్లాక్‌లను కార్పొరేట్ పెట్టుబడారులకు అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే సింగరేణిలోని నాలుగు బొగ్గు బ్లాక్‌లను ఈవేలం ద్వారా పెట్టుబడుదారులకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. తెలంగాణకు బంగారం లాంటి సింగరేణి బొగ్గు బ్లాక్‌లను కాపాడుకునేందుకు ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు. నాయకులు తుమ్మల రాజారెడ్డి, ఎరవల్లి ముత్యంరావు, ఉల్లి మొగిలి, ప్రవీణ్‌కుమార్, ఎస్.వెంకన్న, రాజేశం, మామిడాల శ్రీహరి, సంపత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గుతోనే భవిష్యత్



మాట్లాడుతున్న సూర్యనారాయణ

గోదావరిఖని: నాణ్యమైన బొగ్గు సరఫరాతోనే సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ అన్నారు. బుధవారం ఓసీపీ–3 సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా. రాబోయే ఏడాదిలో కంపెనీ లక్ష్యాలు, భూగర్భగనుల్లో యంత్రాలు, ఓసీపీల్లో భారీ యంత్రాల పనితీరుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సంస్థ పురోభివృద్ధికి ఉద్యోగుల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తీసుకున్నారు. సేల్‌బొగ్గు, రాళ్లు, ఇతర ఐరన్ సామగ్రి బొగ్గులో కలువకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు నర్సింహారావు, బచ్చ రవీందర్, రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, సదానందం పాల్గొన్నారు.

యంత్రాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణరాజు

రామగిరి(మంథని): ఓసీపీల్లో యంత్రాలను సద్వినియోగం చేసుకుంటూ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఓసీపీల జీఎం డీవీఎస్ సూర్యనారాయణరాజు సూచించారు. బుధవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో జీఎం ఎస్.సుధాకర్‌రావు, అధికారులతో బొగ్గు ఉత్పత్తిపై సమీక్షించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కావాల్సిన యంత్రాలు, పరికరాలు, విడిభాగాలతోపాటు పలు అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఏలీషా, ప్రాజెక్టు అధికారి ఎన్.రాధాకృష్ణ, ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఐఈడీ డీజీఎం కె.చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజినీర్లు ఆర్.శ్రీనివాస్, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్ కోరారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కలనీలో కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి సమ్మెపై రూపొందించిన ప్రచార వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అన్నివిభాగాల కార్మికులు, రైతులు, ప్రజలు సమ్మెలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు గట్టయ్య, విజయలక్ష్మి, శంకరమ్మ, సుగుణ, పోచం పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య



మాట్లాడుతున్న గురువయ్య

గోదావరిఖని: బొగ్గు గనుల్లో ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య సూచించారు. బుధవారం ఆర్జీ–2 ఏరియాలోని కాన్ఫరెన్స్ హాలులో రక్షణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డీడీఎంఎస్ అధికారులు సూచించిన రక్షణ ప్రమాణాలను పాటించాలన్నారు. భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలన్నారు. జాగ్రత్తలు పాటిస్తూ పనిచేయాలని, ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తికి తోడ్పడాలని ఆయన కోరారు. సమావేశంలో ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రక్షణ పద్ధతులు పాటించండి

కార్మికులు ఇంటి నుంచి బయలు దేరినప్పటి నుంచే రక్షణ పద్ధతులు పాటించాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య సూచించారు. ఆర్జీ–2 ఏరియా ఏవీటీసీలో ఓరియెంటేషన్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యావంతులైన యువ ఉద్యోగులకు రక్షణపై అవగాహన కలిగించాలని సూచించారు. జీఎం ఎల్వీ సూర్యనారాయణ, ఎస్‌వోటూ జీఎం రవీందర్, ఏవీటీసీ మేనేజర్ రంగారెడ్డి, ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్ నాగెల్లి సాంబయ్య, మహేశ్, కిశోర్, సతీశ్‌కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భారీయంత్రాలతో అధిక ఉత్పత్తి

- ప్రాజెక్టు అధికారి ఎన్.రాధాకృష్ణ



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గోదావరిఖని: భారీ యంత్రాలను సకాలంలో సద్వినియోగం చేసుకుని ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఓసీపీ–1 ప్రాజెక్టు అధికారి ఎన్.రాధాకృష్ణ సూచించారు. బుధవారం ఓసీపీ–1 బేస్‌వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, అంకితభావంతో ముందుకు సాగాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 77 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. సింగరేణి సాధిస్తున్న ప్రగతి, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి చేసిన ప్రణాళికల గురించి సంబంధిత అధికారులు ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, డీజీఎం (ఐఈడీ) కె.చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఆర్.శ్రీనివాస్, యూనియన్ నాయకులు డీటీరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిపై దృష్టి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



సమావేశంలో అధికారులు, ఉద్యోగులు

గోదావరిఖని: రక్షణతో కూడిన ఉత్పత్తిపై ప్రతీ ఒక్కరు దృష్టి సారించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. బుధవారం జీడీకే–2గనిపై ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ పురోభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలన్నారు. నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుతూ సంస్థను ముందుకు తీసుకుపోదామని తెలిపారు. సంస్థ అభివృద్ధి చెందితేనే కార్మికుల సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. భూగర్భ గనుల్లో యంత్రాల వినియోగం పెంచినప్పుడే వ్యయం తగ్గి లాభాలు చేకూరుతాయని తెలిపారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సింగరేణిలోని గనులు, వాటి పనితీరు గురించి వివరించారు. అధికారులు రాంమోహన్, రాంమూర్తి, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, అమరేందర్‌రెడ్డి, రామస్వామి, తిరుపతి పాల్గొన్నారు.